నామమాత్రంగా పంచాయతీరాజ్ దినోత్సవం

- గ్రామస్థాయిలో నాలుగు గోడల మధ్య గ్రామసభలు
- మండల స్థాయిలో 'నా పంచాయతీ-నా ప్రైడ్'కు మంగళం



వంగిపురం సచివాలయంలో గ్రామసభ



ప్రత్తిపాడు పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభ

ప్రత్తిపాడు: పంచాయతీరాజ్ దినోత్సవాన్ని అధికారులు మమ అనిపించారు. రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు ఇచ్చిన లిఖితపూర్వక మార్గదర్శకాలను పెడచెవిన పెట్టారు. అడుగడుగునా నిర్లక్ష్యం వహించి వేడుకలను అట్టహాస్యం చేశారు. గురువారం పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామ, మండల స్థాయిలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. కానీ ప్రత్తిపాడు మండలంలో క్షేత్ర స్థాయిలో వేడుకలను నామమాత్రంగా మీటింగ్‌లు, గాంధీజీ చిత్రపటాలకు నివాళులతో ముగించేశారు.

నాలుగు గోడల వరకే పరిమితం..

వాస్తవానికి గ్రామ, మండల స్థాయి వేడుకల్లో భాగంగా పౌరులు.. అయా అనుబంధ శాఖల అధికారుల భాగస్వామ్యంతో గ్రామ స్థాయిలో పంచాయతీలో గ్రామ సభలు నిర్వహించాలి. కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ కార్యకలాపాలు, 2025-26 ఆర్థిక సంవత్సరానికి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల కింద ప్రణాళికాబద్ధంగా కనిపించే ఆస్తులకు శంకుస్థాపన.. వాల్ ఆఫ్ గవర్నెన్స్ లేదా పంచాయతీ సాధించిన విజయాల గ్యాలరీని ఏర్పాటు చేయడం.. నా పంచాయతీ నా ప్రైడ్ అనే థీమ్‌తో ప్రచారాన్ని చేపట్టడం.. 100 ఏళ్లకు పైగా ఉన్న వారసత్వ నిర్మాణాలు, సాంస్కృతిక సంప్రదాయాలను గుర్తించడం.. వాటిని గ్రామ సూచిక బోర్డులపై ప్రదర్శించడం వంటి అనేక కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉంది. కానీ ఇవేమీ మండలంలో ఆశించిన స్థాయిలో జరగలేదు. పలు గ్రామ పంచాయతీల్లో అందుబాటులో ఉన్న సచివాలయ ఉద్యోగులతో గ్రామ సభల పేరుతో మీటింగులు నిర్వహించి ముగించేశారు.

విస్మరించిన అధికారులు..

వాస్తవానికి నాలుగు గోడల మధ్య గ్రామ సభలు జరపకూడదన్న విషయాన్ని అధికారులు విస్మరించారు. ఇక మండల స్థాయిలో నా పంచాయతీ నాప్రైడ్ అనే థీమ్‌తో పంచాయతీ స్థాయి అభివృద్ధిని ప్రదర్శించడానికి, వికేంద్రీకృత పాలన స్ఫూర్తిని ప్రోత్సహించడానికి కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉన్నప్పటికీ ఆ జాడలే కనిపించలేదు. తుమ్మలపాలెం, నడింపాలెం వంటి పంచాయతీల్లో మాత్రం పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. దీనిపై ఈవోపీఆర్డీ జి.రవికుమార్‌ను 'సాక్షి' వివరణ కోరగా మండల స్థాయిలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించామన్నారు. ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో గ్రామ సభలు జరిపామన్నారు. మిగిలిన కార్యక్రమాలేవీ చేయలేదని అన్నారు.

రెండో రోజు కొనసాగిన మహా మంజీరనాదం





నగరంపాలెం: బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై 15వ అంతర్జాతీయ నృత్య దినోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న మహా మంజీరనాదం -2025 గురువారం రెండో రోజుకి చేరాయి. శ్రీసాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో జరగగా.. పాలక మండలి ఉపాధ్యక్షుడు లంక విజయబాబు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. సంస్థ అధ్యక్షుడు భూసురపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. అనంతరం ఆతీరా ఎ.వర్మ (కొట్టాయం, కేరళ) కూచిపూడి నృత్యాన్ని, లక్ష్మీనాయర్ (తిరువనంతపురం, కేరళ) మోహిని ఆట్టం నృత్యం, పేరిణి కిరణ్(హైదరాబాద్) పేరిణి నృత్యాన్ని ప్రదర్శించారు.

క్లుప్తంగా

ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి చర్యలు

పొన్నూరు: పొన్నూరు ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని డిపో మేనేజరు అజితకుమారి అన్నారు. గురువారం డిపోలోని మేనేజరు కార్యాలయంలో 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫోన్‌లో ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు, సమస్యలను తెలుసుకున్నారు. పెద ఇటికంపాడుకు చెందిన షేక్.ఇబ్రహీం గుంటూరు నుంచి పొన్నూరు వెళ్లే మార్గంలో గాంధీ బొమ్మ సెంటర్‌లో స్టాప్ ఏర్పాటు చేయాలని కోరారు. పొన్నూరు నుంచి గుంటూరు వెళ్లే మార్గంలో పాత పోలీసు స్టేషన్ వద్ద రిక్వెస్ట్ స్టాప్ బోర్డ్ ఏర్పాటు చేసి బస్సులను నిలిపే విధంగా చేయాలని పట్టణానికి చెందిన ఎ.కృష్ణారావు కోరారు. ప్రయాణికుల నుంచి పలు సమస్యలను తెలుసుకుని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని ఆమె తెలియజేశారు.

ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే ఉపేక్షించం



పొన్నూరు: పట్టణ పరిధిలో ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉందని.. వ్యాపారులు పాలిథిన్ కవర్లను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు అన్నారు. గురువారం పట్టణంలోని షరాఫ్ బజార్, ఆంజనేయస్వామి ఆలయం వద్ద దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్నారనే సమాచారంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో ఉంచిన 403 కిలోల ప్లాస్టిక్ కవర్లను గుర్తించి సీజ్ చేశారు. దుకాణ నిర్వాహకులకు రూ.3,500 జరిమానా విధించినట్లు కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు. తనిఖీల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి చిల్డ్రన్ సమ్మర్ క్యాంప్

ప్రత్తిపాడు: పెదనందిపాడులో తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం నుంచి పిల్లల వేసవి శిక్షణా శిబిరం నిర్వహించనున్నామని విజ్ఞాన కేంద్రం కన్వీనర్ దొప్పలపూడి రమేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో రోజూ ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు ఆటలు, పాటలు, స్పోకెన్ ఇంగ్లీషు, మ్యాజిక్, సైన్స్ ప్రయోగాలు, కథలు, చిత్రలేఖనం, క్విజ్ వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు చదివే పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడంతో పాటు పోటీతత్వం, స్నేహభావం పెంపొందించేందుకు ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. వివరాలకు 94412 13006 నంబరును సంప్రదించాలని కోరారు.

ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలి



గుంటూరు రూరల్: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో అంకిరెడ్డిపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ జూనియర్ కళాశాల విద్యార్థిని వి.మధురిమ అర్హత సాధించడం సంతోషమని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. గురువారం ఆయన మధురిమను తమ కార్యాలయంలో అభినందించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలకు ఎదగాలని అన్నారు. స్కూల్ జూనియర్ కళాశాల ప్రధానోపాధ్యాయురాలు సరోజిని మాట్లాడుతూ.. మధురిమ తల్లిదండ్రులు దినసరి కూలీలని.. చదవడాని పేదరికం అడ్డుకాకూడదని మధురిమను చదివించారని అన్నారు. కమిటీ సభ్యులు సంజీవరెడ్డి సహకారంతో శ్రీ చైతన్య కళాశాల యాజమాన్యం మధురిమకి అడ్వాన్స్ కోచింగ్ ఉచితంగా అందించడానికి ముందుకు వచ్చారని ఈ సందర్భంగా ఆమె గుర్తుచేశారు.

ప్రణాళికాబద్ధంగా సన్నద్ధమైతే టీచర్ పోస్టు గ్యారంటీ

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం కావడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టవచ్చని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. బ్రాడీపేటలోని కాంపిటీషన్ సక్సెస్ కళాశాలలో గురువారం డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు. లక్ష్మణరావు ఎడ్యుకేషనల్ సైకాలజీ పుస్తకాలను ఆవిష్కరించారు. డీఎస్సీ-2025 ద్వారా ప్రకటించిన 16,347 ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో అభ్యర్థులు చక్కటి ప్రణాళికతో చదవడం ద్వారా పరీక్షల్లో ఉత్తీర్ణులై ప్రభుత్వ ఉద్యోగం సాధించవచ్చని పేర్కొన్నారు. సిలబస్‌ను పూర్తిగా అధ్యయనం చేసుకుని, పాత ప్రశ్నపత్రాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన కాంపిటీషన్ సక్సెస్ కళాశాల డైరెక్టర్ టీఎస్ రామన్ మాట్లాడుతూ నాలుగున్నర దశాబ్దాలుగా డీఎస్సీ పరీక్షల ద్వారా వందలాది మందిని ఉద్యోగార్థులుగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. ప్రతి సబ్జెక్టుకు నిష్ణాతులైన సీనియర్ అధ్యాపకులచే చక్కటి ప్రణాళికతో సిలబస్ అందిస్తున్నామని అన్నారు. అధ్యాపకులు కోటేశ్వరరావు, నవీన్‌కుమార్, వెంకట్, కుసుమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడుల సమీకరణలపై వర్క్‌షాప్



మాట్లాడుతున్న సుధీర్

గుంటూరు రూరల్: దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కారణమయ్యే నూతన ఆవిష్కరణలకు రక్షణ కల్పించడంలో ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ (ఐ.పి.ఆర్) కీలక పాత్ర పోషిస్తుందని ప్రముఖ పేటెంట్ అటార్నీ ఎం.సుధీర్ అన్నారు. గురువారం చౌడవరంలోని ఆర్.వి.ఆర్.జె.సి ఇంజనీరింగ్ కళాశాలలో 'నావిగేటింగ్ ది స్టార్ట్ అప్ అండ్ ఐ.పి.ఆర్ ఎకోసిస్టం' అనే అంశంపై నిర్వహించిన వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. స్టార్టప్ ప్రారంభ దశ నుంచి పెట్టుబడుల సమీకరణ వరకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. మేధస్సు హక్కుల ప్రాముఖ్యతను తెలుపుతూ, పేటెంట్, ట్రేడ్ మార్క్, కాపీరైట్, డిజైన్‌లు నమోదు చేసుకోవడం ద్వారా వ్యాపారాల్లో పోటీదారుల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని, కళాశాల కార్యదర్శి ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు సైతం కార్యక్రమంలో ప్రసంగించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, కార్యక్రమ కన్వీనర్ ప్రొఫెసర్ డాక్టర్ కె.శోభ, కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

'మలినేని' డేటాసైన్స్ విభాగాధిపతికి పీహెచ్‌డీ



ఎస్.హరికృష్ణ

ప్రత్తిపాడు: మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో డేటా సైన్స్ విభాగాధిపతి ఎస్.హరికృష్ణకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గురువారం పీహెచ్‌డీ పట్టా ప్రధానం చేసినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.అప్పారావు తెలిపారు. ఈ నెల 11వ తేదీన ఏఎన్‌యూలో గైడ్ రామినేని శివరామ ప్రసాద్ ఆధ్వర్యంలో 'నావెల్ అల్గారిథమ్ ఫర్ ఎన్‌హాన్స్‌డ్ సెక్యూరిటీ ఇన్ సీక్రెట్ కీ జనరేషన్ త్రూ ది కాంప్రిహెన్సివ్ బి.బి84 క్వాంటమ్ క్రిప్టోగ్రఫీ ప్రోటోకాల్'పై థీసెస్ రూపొందించి సమర్పించారు. ఉత్తమ ప్రతిభ కనబరచడంతో యూనివర్సిటీ వీసీ కె.గంగాధర్, ప్యానెల్ సభ్యులు హరికృష్ణకు పట్టాను ప్రధానం చేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు, డీన్ పి.రమేష్‌బాబు ఆయా శాఖల విభాగాధిపతులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్ ప్రతిభ



తృతీయ స్థానం పొందిన బృంద సభ్యులతో ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్ ఐజీ రాజకుమారి

తాడేపల్లి రూరల్: ఈ నెల 21, 22, 23 తేదీల్లో ఉత్తర ప్రదేశ్ ఘజియాబాద్‌లో నిర్వహించిన ఫైనల్ కాలేప్స్‌డ్ స్ట్రక్చర్ సెర్చ్ అండ్ రెస్క్యూ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్(ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్) బృందం ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో మూడో స్థానాన్ని సాధించినట్లు ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్ ఐజీ రాజకుమారి గురువారం తెలిపారు. దేశవ్యాప్తంగా 8 టీమ్‌లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాయన్నారు. వివిధ రాష్ట్రాల టీమ్‌లతో పోటీపడి వారికి దీటైన పోటీ ఇచ్చి తృతీయ స్థానం కైవసం చేసుకోవడం హర్షణీయమని ఆమె పేర్కొన్నారు. బృందం సభ్యులను రాష్ట్ర డి.జి.పి హరీష్‌కుమార్ గుప్త, పలువురు ఐజీలు, పోలీస్ విభాగ అధికారులు అభినందించారు.

కరిముల్లా బాబా 16వ ఉరుసు గంధ మహోత్సవం రేపు



విద్యుత్ కాంతుల అలంకరణలో పెదకాకాని కరిముల్లా బాబా నిషాని

పెదకాకాని: కరిముల్లా బాబా 16వ ఉరుసు గంధ మహోత్సవం శనివారం నుంచి ఘనంగా ప్రారంభమవుతుందని దర్గా నిషాని వ్యవస్థాపకుడు పఠాన్ మహబూబ్ సుభాని తెలిపారు. పెదకాకాని గ్రామంలోని బాజీనగర్‌లో వెలసిన కరిముల్లా షా ఖాదరి నిషాని వద్ద గురువారం ధర్మకర్త పఠాన్ మహబూబ్ సుభాని మాట్లాడుతూ.. 3 రోజుల ఉరుసు మహోత్సవంలో భాగంగా 26న రాత్రి కంబల్ ఫాతేహా, 27వ తేదీ రాత్రి 10 గంటలకు పెదకాకానిలోని దర్గా నుంచి గంధం, గుర్రం బయలుదేరు కార్యక్రమాలు ఉంటాయన్నారు. సోమవారం ఉదయం 11 గంటలకు సలామి ప్రార్థనలు, ఖురాన్ పఠనము, అనంతరం భక్తులకు గంధం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

ప్రత్తిపాడు: మండలంలోని ప్రైవేటు పాఠశాలలు కచ్చితంగా శనివారం మధ్యాహ్నం లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల విద్యాశాఖాధికారి కెనడి తెలిపారు. 2009 సెక్షన్ 12(1)సీ ప్రకారం 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 1వ తరగతిలో 25 శాతం ఉచిత ప్రవేశాలు కేటాయించాలని.. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

దోమల నియంత్రణకు జాగ్రత్తలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కొర్రా విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: ప్రపంచ మలేరియా దినోత్సవం పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తన చాంబర్‌లో వైద్యాధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మలేరియా నియంత్రణలో భాగంగా ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పరిశుభ్రపరచుకోవాలని తెలిపారు. ప్రతీ శుక్రవారం డ్రై డేగా పాటించాలన్నారు. హాస్టల్, స్కూల్స్‌లో డోర్లకు మెష్‌లు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. గనుల ప్రాంతాల్లో, క్వారీల్లో, నిలువ నీటిలో మలేరియా ఆయిల్ బాల్స్‌ని ఉపయోగించుకోవాలని సూచించారు. సాయంత్రం సమయంలో దోమలు ఇళ్లలోకి రాకుండా తలుపులు, కిటికీలు మూసివేయాలని తెలిపారు. ఒంటినిండా కప్పివుండే దుస్తులు ధరించి, ప్రతి ఒక్కరూ తప్పకుండా దోమతెరలు వాడాలని సూచించారు. అందరు పరస్పర సహకారంతో దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల్ని నివారించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ ఎ.శ్రావణ్ బాబు, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ రోహిణి రత్నశ్రీ, జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్. రవి బాబు, జిల్లా పంచాయతీ ఆఫీసు, జిల్లా విద్యాశాఖ, జిల్లా మత్స్య శాఖ, గనుల శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

లక్ష్మీపురం: అరండల్ పేట నాలుగో లైన్‌లోని పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైనట్లు గురువారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామానికి చెందిన కారుమంచి అమర తేజ అరండల్‌పేట 4వ లైనులోని ఒక ప్రైవేటు ఆఫీసులో పనిచేస్తున్నాడు. మార్చి 31 సాయంత్రం ఆఫీసు ముందు తన ద్విచక్రవాహనం పార్కింగ్ చేసి తరువాతి రోజు వచ్చే సరికి వాహనం కనిపించలేదు. చుట్టుపక్కల పరిశీలించి, గుంటూరు బస్టాండ్ రైల్వే స్టేషన్ పరిధిలోని పార్కింగ్ ప్రదేశాల్లో పరిశీలించినా కనిపించకపోవడంతో చోరీకి గురైనట్లుగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోరంట్ల వేంకటేశ్వరుని ఆదాయం రూ.6 లక్షలు

గుంటూరు రూరల్: నగర శివారులోని గోరంట్ల గ్రామంలో వేంచేసిన శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీ ఆదాయాన్ని దేవాదాయ శాఖ అధికారులు గురువారం లెక్కించారు. గత రెండు నెలలకు గానూ హుండీ ఆదాయం రూ.5,94,595లు సమకూరిందని ఆలయ కార్యనిర్వాహణ అధికారి డి.వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రైవేటు వ్యక్తుల ఆధ్వర్యంలో ఉన్న ఆలయం ఇటీవల దేవాదాయ శాఖ పరిధిలోకి వచ్చిందని అన్నారు.

తవ్వారు...వదిలేశారు.

రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు



నగరంపాలెం: స్థానిక నెహ్రూనగర్ వాటర్ ట్యాంక్ ఎదురు రోడ్డు అధ్వానంగా మారింది. భూగర్భ డ్రైనేజీ పనుల నిమిత్తం గతంలో పనులు చేపట్టారు. పనులు ముగిసిన రహదారి మధ్యలో గుంతలను సీసీ రహదారిగా నిర్మించలేదు. దీంతో నెహ్రూనగర్ రైల్వే గేట్, సంజీవయ్యనగర్ రైల్వేగేట్, వెంకటాద్రిపేట వైపు వెళ్లే వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. రహదారి సగానికి పైగా అధ్వానంగా ఉండటంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నామని స్థానికులు తెలిపారు. ఉదయం, సాయంత్రం వేళల్లో జనసంచారంతో మరింత రద్దీగా ఉండటంతో మరింత కష్టంగా ఉంటుందని వాపోయారు. ఇప్పటికైనా జీఎంసీ అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాద దాడి అమానుషం

ఎల్‌ఐసీ ఉద్యోగుల యూనియన్ కార్యదర్శి రాజేంద్రప్రసాద్



కొరిటెపాడు(గుంటూరు): ఉనికి కోసం అమాయక పర్యాటకులను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులను తుద ముట్టించాలని, ఉగ్రవాదుల చేతిలో అసువులు బాసిన పర్యాటకుల ఆత్మలకు శాంతి చేకూర్చాలని ఎల్‌ఐసీ ఉద్యోగుల యూనియన్ కార్యదర్శి జె.రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దురాగతాన్ని ఖండిస్తూ అరండల్‌పేటలోని ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద గురువారం సాయంత్రం ఉద్యోగులు, సిబ్బంది ప్లకార్డులు పట్టుకొని నిరసన కార్యక్రమం చేపట్టారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. కాశ్మీరులో ప్రశాంతత నెలకొన్నదని ప్రజలు భావిస్తున్న సమయంలో అనేక మంది అమాయక పౌరులను అత్యంత కిరాతకంగా కాల్చి చంపడం దారుణమన్నారు.పౌరుల మృతికి సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఎల్‌ఐసీ అధికారులు ఆర్‌వీ సుబ్బారావు, జి.కిషోర్, సురేష్, విజయ రాఘవ, ఉమామహేశ్వరరావు, శ్రీదేవి, సుమ, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డుని పునరుద్ధరించాలి

డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్‌కు వినతి

లక్ష్మీపురం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నప్పటికీ భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు చేయలేదని భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. అరండల్‌పేటలోని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించకపోవడం వల్ల మరణించినా, ప్రమాదాలు జరిగినా వారిని ఆదుకునే అవకాశం లేకుండా పోయిందని అన్నారు. అధికారంలోకి రాగానే భవన నిర్మాణ సంక్షేమ బోర్డుని పునరుద్ధరిస్తామని యువగళం పేరుతో నిర్వహించిన యాత్రలో లోకేష్ హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీ అమలు పరచకపోవడం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం పట్ల టీడీపీకి ఎంత శ్రద్ధ ఉందో అర్థమవుతుందని అన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 6000 పెండింగ్ క్లెయిమ్‌లను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే భవన నిర్మాణ కార్మికులు ప్రత్యక్ష ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బాబురావు, కోటేశ్వరరావు సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి జనసేనలో చేరిక

ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తీరుపై అసంతృప్తి



జనసేనలో చేరుతున్న టీడీపీ మాజీ సర్పంచ్ మస్తాన్

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తీరును నిరసిస్తూ ఆ పార్టీ నాయకులు కొందరు టీడీపీని వీడారు. ఏళ్ల తరబడి పార్టీ కోసం పని చేసినా.. మాకు కనీస గుర్తింపు, గౌరవం ఇవ్వకపోవడంపై టీడీపీని వదిలి జనసేన పార్టీలోకి చేరారు. వివరాల్లోనికి వెళితే.. వట్టిచెరుకూరు మండలం కాట్రపాడు మాజీ సర్పంచ్ వల్లభాపురపు మస్తాన్ అనేక సంవత్సరాలుగా టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. రావెల కిషోర్‌బాబు మంత్రిగా ఉన్న సమయంలో కాట్రపాడు సర్పంచ్ (టీడీపీ)గా ఉన్న ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మస్తాన్ అనేక అభివృద్ధి కార్యక్రమాలను కూడా చేపట్టాడు. అప్పటి నుంచి నేటి వరకు పార్టీలోనే ఉంటూ తనతో పాటు తన వర్గం పార్టీ బలోపేతానికి కృషి చేశారు. ఏడాది కిందట జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు విజయానికి కూడా కృషి చేశారు. కాగా గద్దెనెక్కిన ఎమ్మెల్యేకు తమ సమస్యను చెప్పుకునేందుకు మస్తాన్ ప్రయత్నించినప్పటికీ కనీసం కలిసేందుకు కూడా వీలుకాకపోవడం, తమకు అభివృద్ధి పనుల్లో ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురైయ్యారు. దీంతో గురువారం తమ వర్గానికి చెందిన కొందరు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు సమక్షంలో పార్టీ చేరారు. మాజీ సర్పంచ్ మస్తాన్ పార్టీని వీడడం స్థానికంగా చర్చనీయాంశమయ్యింది.

లాడ్జికి అనధికారికంగా డ్రెయినేజీ కనెక్షన్

- తొలగించేందుకు వెళ్లిన ఇంజినీరింగ్ సిబ్బంది
- దురుసుగా ప్రవర్తించిన లాడ్జి నిర్వాహకులు
- పోలీసుల సాయంతో కనెక్షన్ తొలగింపు



జిన్నాటవర్ సెంటర్, శీలం వారి వీధిలో లాడ్జి



పోలీస్ అధికారి సమక్షంలో డ్రెయినేజీ కనెక్షన్‌ను తొలగిస్తున్న ఇంజినీరింగ్ అధికారులు

నెహ్రూనగర్: తూర్పు నియోజకవర్గ పరిధిలోని జిన్నాటవర్ సెంటర్, శీలం వారి వీధిలో ఓ లాడ్జి నిర్వాహకులు అనధికారికంగా డ్రెయినేజీ కనెక్షన్ ఇచ్చుకున్నారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో దానిని తొలగించేందుకు ఇంజినీరింగ్ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. కనెక్షన్ తొలగించే సమయంలో సిబ్బందిపై లాడ్జి నిర్వాహకులు దురుసుగా ప్రవర్తించారు. ఇంజినీరింగ్ అధికారులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సమక్షంలో ఇంజినీరింగ్ అధికారులు కనెక్షన్‌ను తొలగించారు.

గతంలో వాటర్, డ్రెయినేజీ కనెక్షన్‌లు తొలగింపు

లాడ్జి నిర్వాహకులు పన్ను బకాయిలు లక్షల్లో ఉన్నారు. దీంతో నగరపాలక సంస్థ నుంచి వాటర్, డ్రెయినేజీ కనెక్షన్ ఇచ్చే అవకాశం లేదు. దీంతో లాడ్జి నిర్వాహకులు అనధికారికంగా వాటర్, డ్రెయినేజీ కనెక్షన్లు ఇచ్చుకున్నారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో రెండు నెలల కిందట వాటిని తొలగించారు. తిరిగి రాత్రికి రాత్రే అనధికారికంగా డ్రెయినేజీ కనెక్షన్ ఇచ్చుకున్నారు. వెంటనే అక్కడికి వెళ్లిన ఇంజినీరింగ్ అధికారులు కనెక్షన్‌ను పోలీసులు సాయం తీసుకుని తొలగించారు.

రూ.70లక్షలు ఆస్తి పన్ను బకాయి

లాడ్జికి రూ.70లక్షల దాకా ఆస్తి పన్ను బకాయిలు ఉన్నాయి. దీనిని వసూలు చేయడంలో రెవెన్యూ అధికారులు ఎందుకు ఉదాసీనత ప్రదర్శిస్తున్నారో అర్థం కావడంలేదు. గతంలో పన్ను బకాయిలు ఉన్న ఆస్తులను నగర కమిషనర్ ఆదేశాల మేరకు వారి ఆస్తులను సీజ్ చేసిన సంఘటనలు చాలా ఉన్నాయి. నగర నడిబొడ్డున, కార్పొరేషన్ కార్యాలయానికి కూత వేటు దూరంలో రూ.70లక్షల దాకా పన్ను బకాయిలు ఉంటే రెవెన్యూ అధికారులు ఎందుకు నోరు మెదపడం లేదో అర్థం కావడం లేదు. ఈ బిల్డింగ్ పైన అనధికారికంగా పెంట్ హౌస్ నిర్మించినప్పటికీ పట్టణ ప్రణాళిక అధికారులు కూడా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో కార్పొరేషన్ అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జాబ్‌మేళాలో 120 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన వారితో కళాశాల యాజమాన్యం

గుంటూరు ఎడ్యుకేషన్: సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య-కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాలలో గురవారం మ్యాజిక్‌బస్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన జాబ్‌మేళాలో 120 మంది అభ్యర్థులు వివిధ సంస్థల్లో ఉద్యోగాలు పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు తెలిపారు. 16 కంపెనీలు పాల్గొన్న జాబ్‌మేళాలో 300 మంది యువత నమోదు చేసుకున్నారు. ఇంటర్వ్యూలు నిర్వహించిన ఆయా సంస్థల ప్రతినిధులు జాబ్ ఆఫర్ లెటర్లు అందజేశారని ఆయన తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు పచ్చిపులుసు రాఘవరావు, కార్యదర్శి కె.సూర్యనారాయణ, బాపూజీ కమిటీ విద్యాసంస్థల కార్యదర్శి కర్పూరపు రామకృష్ణప్రభు, మ్యాజిక్‌బస్ ఇండియా ప్రతినిధి సీహెచ్ మోహన్ పాల్గొన్నారు.